

జానపద కళలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

జానపద కళలను ప్రోత్సహించాలని జానపద గాయకుడు టి.పవన్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద కళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. జానపద సాహిత్యం మన భారతీయులకు ఎంతో గర్వకారణం అన్నారు. కన్నెర్లుగా ప్రాచీన జానపద కళారూపం తోలుబొమ్మలాట, హరికథలు, బుర్రకథలు, జానపద నాట్యం ఇలా పలు విద్యలను తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చామన్నారు. ఇటీవల ఇటలీ నిర్వహించే జబర్దస్త్ కార్యక్రమంలో కూడా పాల్గొన్నామని పవన్ తెలిపారు. అనంతరం జానపద గేయాలను ఆలపించి తోలుబొమ్మలాట ప్రదర్శించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో పవన్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

సిఎం సారూ.. ఇవీ సమస్యలు.!

- ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ ఎప్పుడు
- సెజ్ లో కానరాని పరిశ్రమలు
- ఉపాధి కోసం యువత ఎదురుచూపు
- నేడు జిల్లాలో సిఎం చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు రెండోసారి జిల్లాకు వస్తున్నారు. తొలుత గతేడాది సెప్టెంబర్ 11న కిర్లంపూడి మండలం రాజుపాలెంలోని వరద ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించారు. ఇప్పుడు మళ్లీ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దాపురంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో సిఎం పర్యటనపై దీర్ఘకాలికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తారని కాకినాడ జిల్లా వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఏలేరు ఆధునీకరణ లేక అవస్థలు

అధికారం చేపట్టిన తర్వాత గతేడాది సెప్టెంబర్‌లో జిల్లాలో తొలిసారి పర్యటించిన ఆయన ఏలేరు వరద కారణంగా మునిగిపోయిన ప్రాంతాలను పరిశీలించారు. ఏలేరు ఆధునీకరణ పనులు జరగకపోవడమే ఈ ముంపునకు కారణం అంటూ చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతోందంటూ ఆరోజు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పైనే కావస్తున్నా నేటికీ దీని ఆధునీకరణ ఊసు ఎత్తడం లేదని రైతాంగం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఏలేరు ప్రాజెక్టు సాగు నీటి ఆధారంగా జగ్గంపేట, పెద్దాపురం, తుని, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల్లోని దాదాపు 53 వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయి. సుమారు 40 వేల మంది రైతులు దీనిపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆధునికరణకు రూ.139 కోట్లతో ధర్మవరం వద్ద శంకుస్థాపన చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో 60 శాతం పనులు పూర్తయ్యాయి. పేజ్-2లో మిగిలిన 40 శాతం పనులను పూర్తికి రూ.394 కోట్ల నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేసినా గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వైసిపి అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టింది. గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదల వల్ల ఏలేరు కాలువకు 280 చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. అరకొరగా 60 చోట్ల గండ్ల పనులు పూర్తి చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మిగిలిన గండ్ల పనులు చేయడానికి ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. సుమారు రూ.10 కోట్లు అంచనాలు రూపొందించి అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు కేటాయింపు జరగలేదు. గొల్లప్రోలు మండలంలోని సుద్దగడ్డ ఆధునీకరణకు అప్పటి టిడిపి ప్రభుత్వం రూ.160 కోట్లు కేటాయించి పనులకు శంకుస్థాపన చేసి వదిలేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అటకెక్కించారు. సుద్దగడ్డ కాలువ వల్ల గొల్లప్రోలు, ప్రత్తిపాడు మండలాల్లో సుమారు 25 వేల ఎకరాల పంటలు సాగవుతున్నాయి. 38 ఏళ్లుగా సుద్దగడ్డ ఆధునీకరణ లేక పంటలు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించక ఈ రెండు మండలాల్లో 20 గ్రామాల ప్రజలు ముంపు బారిన పడుతున్నారు.



గతేడాది కిర్లంపూడి మండలం ముక్కోల్లులో వరద ప్రభావిత ప్రాంతంలో చంద్రబాబు (ఫైల్ ఫోటో)

పరిశ్రమలేవీ..?

దాదాపు 13 ఏళ్ల క్రితమే కాకినాడ సెజ్ పేరుతో యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల భూములను సేకరించారు. గత వైసిపి ప్రభుత్వం దాదాపు 2 వేల ఎకరాలను తిరిగి రైతులకు ఇచ్చేసేందుకు చర్యలు చేపట్టింది. నేటికీ రిజిస్ట్రేషన్లు ప్రక్రియ పూర్తికాలేదు. అయితే మిగిలిన 8 వేల ఎకరాలలో ఒక రెండు చిన్న పరిశ్రమలు తప్ప నేటికీ పెద్ద పరిశ్రమల జాడ కనిపించడం లేదు. అవి కూడా గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే వచ్చాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియోజకవర్గం పరిధిలో కూడా ఈ భూములు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్లు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఉద్యోగాల భర్తీ కాకపోవడంతో ప్రతి సంవత్సరం కాకినాడ జిల్లాలో 15 వేల మంది యువత నిరుద్యోగులుగా మారుతున్నారు. వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంది.

పర్యాటకాభివృద్ధిపై దృష్టి సారించేనా..?

కోరంగి మడ అడవులు, కాకినాడ, ఎస్.యానాం, ఉప్పాడ సముద్ర తీర ప్రాంతాలు ఇలా అనేక పర్యాటక ప్రదేశాలున్న జిల్లాకు పర్యాటకుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం, సామర్లకోట భీమేశ్వరస్వామి టెంపుల్, పిఠాపురం పాదగయ దేవస్థానం టెంపుల్ టూరిజాన్ని మరింతగా అభివృద్ధి చేయాలి. కాకినాడ బీచ్ అభివృద్ధి నిలిచిపోయింది. దీంతో జిల్లా పర్యాటకాభివృద్ధి ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఉప్పాడలో తలపెట్టిన హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్ రక్షణకు శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలి. జిల్లా కేంద్రం కాకినాడకు ప్రధాన రైల్వే లైన్‌కు లింకు చేయాలి.

సబ్ ప్లాన్ గ్రామాలను పట్టించుకోరా..?

ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్న 56 సబ్ ప్లాన్ గ్రామాలను ఐటిడిఎలో విలీనం చేయాలని అనేకళ్లుగా గిరిజనులు డిమాండ్ చేస్తున్నా సర్కారు పట్టించుకోవడం లేదు. అభివృద్ధి, మౌలిక సదుపాయాలు లేక ఇక్కడ గిరిజనులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇక్కడ గిరిజనుల హక్కులు పూర్తిగా అణచివేయబడుతున్నాయి. ఇప్పటికైనా సబ్ ప్లాన్ గ్రామాలను ఐటిడీఏలో విలీనం చేయాల్సిన అవసరం ఉంది.

సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-కాకినాడ, పెద్దాపురం

ఈ నెల 23న ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దాపురం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం పెద్దాపురంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులతో కలిసి పరిశీలించారు. తొలుత పెద్దాపురం 10వ వార్డులోని మ్యాజిక్ డ్రైన్‌ను పరిశీలించి పారిశుధ్య కార్మికులు, అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం హెలిప్యాడ్, స్టాల్స్ ఏర్పాటు, ప్రజా వేదిక వద్ద జరుగుతున్న పనులను జెసి రాహుల్ మీనా, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప, ముఖ్యమంత్రి పర్యటన కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్టు తెలిపారు. స్టాల్స్ సందర్శన, ప్రజావేదిక సభా కార్యక్రమం, సిఎం లబ్ధిదారులతో ముఖాముఖి, లబ్ధిదారుల తరలింపు, భోజన కార్యక్రమాలు ఇతర అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దష్టి పెట్టి సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



సిఎం పర్యటనా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

శనివారం ఉదయం 11 గంటలకు పెద్దాపురం-జి.రాగంపేట రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి పెద్దాపురం 10వ వార్డులో మ్యాజిక్ డ్రైన్, స్వచ్ఛా రథాలను పరిశీలిస్తారని ఆయన తెలిపారు. అనంతరం స్వచ్ఛా ర్యాలిని ప్రారంభించి ప్రజా వేదిక వరకు ర్యాలీగా చేరుకుంటారన్నారు. అక్కడ ఉన్న స్టాల్స్‌ను పరిశీలించిన అనంతరం ప్రజా వేదిక సభా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. పూర్ణ కళ్యాణ మండపంలోని పార్టీ కేడర్‌తో సమావేశం అనంతరం ఉండవల్లికి ప్రయాణం అవుతారని తెలిపారు. కలెక్టర్ వెంట డిఆర్ఒ వెంకటరావు, పెద్దాపురం ఆర్‌డిఒ కె.శ్రీరమణి, డిపిఒ రవికుమార్, పెద్దాపురం కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, ఎస్‌డిజి జిజిహెచ్‌ఎన్.శ్రీధర్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ దేవులా నాయక్, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-కాకినాడ

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద శుక్రవారం ఎస్ఎఫ్ఐ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. పేద మధ్య తరగతి విద్యార్థులకు విద్యను అందించవలసిన ప్రభుత్వాలు విద్యను అందని ద్రాక్షగా తయారు చేస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి నేడు విద్యారంగాన్ని కనీసం పట్టించుకోలేని పరిస్థితి ఉందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన జాతీయ విద్యా విధానం పేరు చెప్పి విద్యను మొత్తం ప్రైవేటీకరణ కేంద్రీకరణ, కాషాయీకరణ చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్యారంగంలో పెండింగ్‌లో ఉన్న రూ.64 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్లను తక్షణమే విడుదల చేయాలని, జిఒ నెంబర్ 77ను రద్దు చేసి ప్రైవేట్ కాలేజీలో పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎ.వాసుదేవ్, చిన్ని, జైరామ్, సత్యం, ఆదర్శ్, కార్తీక్, తేజ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదిత్య విద్యార్థుల పరిశ్రమల సందర్శన

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులకు విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ పరిశ్రమ సందర్శన విజయవంతంగా నిర్వహించినట్టు డిప్యూటీ ప్రోఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ పర్యటనలో మొత్తం 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారితో పాటు అధ్యాపకులు జెడి వెంకటేష్, డాక్టర్ డి.రాంబాబు ఉన్నారు. ఈ పరిశ్రమ పర్యటన ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, తయారీ విధానాలు, పరిశ్రమ అవసరాలపై విలువైన ప్రత్యక్ష జ్ఞానం పొందారు. విభాగధిపతి డాక్టర్ భీమేష్ రెడ్డి పరిశ్రమల సందర్శన ఎంతో విజ్ఞదాయకంగా పలప్రదంగా ముగిసిందని తెలిపారు.



న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-కాకినాడ

బాలికలు కౌమారదశలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఐసిడిఎస్ పీడీ సి.లక్ష్మి పేర్కొన్నారు. కాకినాడ దంటు కళా క్షేత్రంలో శుక్రవారం అవగాహనా సదస్సులో ఆరోగ్య రక్షణ, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. డివైఇఒ ఎస్.వెంకటేశ్వరరావు, సిడిపిఒ మాధవి మాట్లాడారు. అనంతరం బాలికలకు రిలయన్స్ వారు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ప్రతినిధులు మదన్‌పాల్, పోతాప్రగడ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-కాజులూరు

ఈ నెల 27న జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసుకొనే గణేష్ పందిళ్ళు, మండపాలు ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు పొందాలని గొల్లపాలెం ఎస్క్మి మోహన్ కుమార్ తెలిపారు. మండపాల ఏర్పాటుకు చలానాలు చెల్లించనవసరం లేదని, సులభంగా అనుమతులు పొందవచ్చని తెలిపారు. https://ganeshutsav.netపై క్లిక్ చేసి అనుమతులు పొందాలపి సూచించారు.

మౌలిక సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో మౌలిక సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి పెట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సిరపరపు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ ప్రధాన కేంద్రమైన పెద్దాపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెడుతున్నామన్నారు. ఈ సమస్యల పరిష్కారంపై ఆయన దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని చేసిన ప్రకటనలు నేటికీ నెరవేరలేదన్నారు. గతంలో ఉన్న కమ్యూనిటీ ఆసుపత్రిని ఏరియా హాస్పిటల్‌గా మారుస్తూ బోర్డు పెట్టారు తప్ప ఆ స్థాయికి అభివద్ధి చేయలేదన్నారు. ప్రస్తుత జనాభా, పట్టణ విస్తరణ దష్టిలో పెట్టుకుని పారిశుధ్య సిబ్బందిని పెంచడం లేదన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా నిర్మించిన టిడ్కో అపార్ట్మెంట్లు సంవత్సరాలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో నేటికీ లబ్ధిదారులకు అప్పగించలేదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు గరగపాటి పెంటయ్య, శ్రీనివాస్, నెక్కల నరసింహమూర్తి, రొంగల వీర్రాజు, కూనిరెడ్డి అప్పన్న, చల్లా విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూరిబాబు

వీరబాబును పూర్తిగా తొలగించాలి

ప్రజాశక్తి-కరప

వికలాంగురాలిపై అత్యాచారం కేసులో సస్పెండ్ అయిన వేములవాడలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మట్టపర్తి వీరబాబును విధుల నుంచి పూర్తిగా తొలగించాలని పలువురు డిమాండ్ చేశారు. అయ్యాడు. శుక్రవారం ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణిని కలిసి బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. వీరబాబును కేవలం సస్పెండ్ చేయడం సరిపోదదని, విధుల నుంచి పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఐద్వా నేత సిహెచ్.రమణితో కలిసి బాధితురాలి కుటుంబ సభ్యులు అధికారులను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరబాబు తరచూ మహిళలతో అగౌరవంగా ప్రవర్తించడం, పనులకు వచ్చిన వారిని ఇబ్బంది పెట్టడం చేసేవాడని, కార్మికుల సంఖ్య కంటే ఎక్కువగా మస్తర్లు వేసి, కొంతమంది కూలీల పేర్లతో నకిలీ బ్యాంకు ఖాతాలు తెరచి డబ్బులు డ్రా చేసుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిహెచ్ రమణి

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకుంటుంది

ప్రజాశక్తి - జగ్గంపేట

ఆటో కార్మికులను ఆదుకునేందుకు సిఎం చంద్రబాబు ప్రత్యేక పథకాన్ని తీసుకు రానున్నారని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తెలిపారు. స్థానిక కాపు కళ్యాణ మండపం వద్ద నియోజకవర్గంలోని ఆటో కార్మికులు ఒక్కొక్కరికీ రూ.25 కేజీల బియ్యం ప్యాకెట్లను జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఆయన శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ 6 పథకాల్లో భాగంగా మహిళలకు ఫ్రీ బస్సు పథకాన్ని అమలు చేశారన్నారు. దానివల్ల ఆటో కార్మికులకు నష్టం జరిగిందని, ప్రభుత్వం సాయం అందించేలోపు తాత్కాలిక ఉపశమనం కోసం నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లకు తమ ఫౌండేషన్ ద్వారా నవీన్ ఈ సహాయాన్ని అందిస్తున్నరన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, కొత్త వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, టిడిపి నాయకులు పోతుల మోహన్ రావు, జీను మణి బాబు, వీరంరెడ్డి కాశీ బాబు, అడబాల భాస్కరరావు, పాండ్రంకి రాంబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, రాయి సాయి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ



క్యూ లైన్లలో మహిళల అవస్థలు

పాదగయలో మహిళల అవస్థలు

ప్రజాశక్తి-పిఠాపురం

ప్రముఖ పుణ్యక్షేత్రం పాదగయలో శ్రావణ మాసం చివరి శుక్రవార సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలతో సందడిగా మారింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎంఎల్ఎ పవన్ కళ్యాణ్ సుమారు పది వేల మంది మహిళలకు కానుకగా చీర, పసుపు కుంకుమలు అందిస్తారన్న భారీ ప్రచారం జరగడంతో తెల్లవారుజాము నుండే పెద్ద ఎత్తున మహిళలు ఆలయానికి పోటెత్తారు. క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. వరలక్ష్మి వ్రత టోకెన్ ఉంటేనే ఆలయంలోకి అనుమతి ఉండడంతో... టోకెన్ లేని వారు ఆలయం వెలుపల పరిగాపులు పడ్డారు. వ్రతం ఆచరించేందుకు అధిక సంఖ్యలో పాల్గొంటారన్న సమాచారం ఉన్నప్పటికీ తగిన ఏర్పాట్లు చేయడంలో ఆలయ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధిక సంఖ్యలో మహిళలు ఆలయానికి వచ్చినా ఆలయ సిబ్బంది తమకు ఏమీ పట్టనట్టుగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఆలయ ప్రవేశం సైతం లేకపోవడంతో వారు నిరాశతో వెను తిరగాల్సి వచ్చింది. పాసులు ఉన్నా తమకు చీరలు అందలేదంటూ పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.


రెడ్ క్రాస్ శిక్షణా శిబిరానికి ఆదిత్య విద్యార్థులు

ప్రజాశక్తి - కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాల యూత్ రెడ్ కలర్స్ వింగ్ వాలంటీర్లు జాతీయ స్థాయి యూత్ రెడ్ క్రాస్ శిక్షణా శిబిరానికి ఎంపికైనట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్. నాయుడు తెలిపారు. రెడ్ క్రాస్ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి ఆదిత్య డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ రింగ్ విద్యార్థులు ఎంపికయ్యారు. యూత్ రెడ్ క్రాస్ జాతీయస్థాయి శిక్షణా శిబిరం ఈ నెల 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రలో జరగనుంది. ఈ శిబిరానికి ఆదిత్య డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ రింగ్ విద్యార్థులు ఎం.రాహుల్ కుమార్, వి.సంతోష్ కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ కాకినాడ రెడ్ క్రాస్ సంస్థ నిర్వహిస్తున్న విభిన్నమైన ప్రత్యేక కార్యక్రమాల గురించి జాతీయస్థాయి సమావేశంలో మాట్లాడేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. తమ విద్యార్థులను ఎంపిక చేసినందుకు ఐఆర్‌సిఎస్ రాష్ట్ర చైర్మన్ వైడి.రామారావుకు, కాకినాడ ఐఆర్‌సిఎస్ వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జి మూర్తి, ఐఆర్‌సిఎస్ నోడల్ ఆఫీసర్ టి.తేజేశ్వరరావు, డి.అశ్విని అభినందించారు.



శిక్షణా శిబిరానికి ఎంపికైన విద్యార్థులు



గ్యాస్ పైప్‌లైన్ గోతులతో అవస్థలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆరు నెలల క్రితం గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణానికి భాగ్యనగర్ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో గోతులు తవ్వారు. పైపులైన్ వేసిన తర్వాత సిమెంట్ వాకిళ్లలో తవ్విన గోతులు సిమెంట్‌తో పూడ్చకుండా వదిలేసి వెళ్లిపోయారు. దీనిపై మున్సిపల్ అధికారులకు కొంతమంది కౌన్సిలర్లు, ప్రజా సంఘాల వారు విజ్ఞాపనలు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. ప్రకారం మున్సిపాలిటీ వేసిన సిమెంటు రోడ్డు తవ్వినచోట సిమ్మెంటుతో పూడ్చి వేశారు. రోడ్డుకు ఇంటికి మధ్య వాకిలి స్థలంలో ఇంటి యజమానులు తమ సొంత సొమ్ముతో నిర్మించుకున్న సిమ్మెంటు వాకిళ్లను అనేక వీధుల్లో పైపులైను కోసం తవ్వేశారు. పైపులైన్ ఏర్పాటు చేసిన తర్వాత ఆ వాకిళ్లు సిమెంట్ చేయకుండా అలాగే వదిలేశారు. మున్సిపల్ అధికారులు మాత్రం మున్సిపాలిటీ సొమ్ముతో ఏర్పాటు చేసిన రోడ్లు తవ్వినచోట గ్యాస్ కంపెనీ యాజమాన్యంతో సిమ్మెంటుతో పూడ్పించారు. ఇంటి యజమానుల సిమెంట్ వాకిళ్లను తవ్విన చోట తిరిగి సిమ్మెంటుతో పూడ్పించే బాధ్యత విస్మరించారు. దీంతో అనేక వీధుల్లో సిమ్మెంటు వాకిళ్లలో తవ్విన గోతులు వర్షాలకు బురద గుంటలుగా మారిపోతున్నాయి. గ్యాస్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేదా మున్సిపాలిటీ సొమ్ముతో ఈ గోతులు సిమెంట్తో పూడ్పించాలని బాధిత ఇంటి యజమానులు మున్సిపల్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



సిమెంట్ వాకిళ్లలో తవ్విన గోతులు



మీడియాతో మాట్లాడుతున్న నరసింహం

నా మాటలను వక్రీకరించారు : నరసింహం

ప్రజాశక్తి - జగ్గంపేట

తాను అన్న మాటలను జగ్గంపేట ఎఎల్ఎ జ్యోతుల నెహ్రూ వక్రీకరించి మాట్లాడారని మాజీ ఎంపీ, వైసిపి నేత తోట నరసింహం అన్నారు. వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రోడ్డుపై నిరసన తెలిపితే దాన్ని ఎంఎల్ఎ నెహ్రూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం అన్నట్టుగా వక్రీకరించారన్నారు. తాను ఏమి మాట్లాడానో తెలుసుకుని మాట్లాడి ఉంటే బాగుండేదన్నారు. ఈ సమావేశంలో వైసిపి నేతలు కరుటూరి వీర్రాజు, తులా రాము, రావుల గణేష్ రాజా ం పాల్గొన్నారు.

తాగునీటి నీటి పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణ ప్రజలకు బూస్టర్ లైన్ నుంచి తాగునీటి సరఫరా చేసే పైపులైనుకు లీకులు ఏర్పడటంతో మున్సిపల్ అధికారులు మరమ్మతు పనులు చేస్తున్నారు. బుధవారం ఈ ఐదు చోట్ల లీకులను శాశ్వతంగా అరికట్టేందుకు చర్యలు చేపట్టామని మున్సిపల్ ఎఇ పివి.సుధాకర్ తెలిపారు. జెసిబి ద్వారా గోతులు తవ్వి సిబ్బంది బుధవారం పగిలిన పైపు రిపేరు పనులు ప్రారంభించారన్నారు. ఈ పనులను మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.



జెసిబి ద్వారా గోతులు తీస్తున్న సిబ్బంది

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా మహిళా కూలీ మృతి

ప్రజాశక్తి - గోపాలపురం



ట్రాక్టర్ బోల్తా పడి మహిళా కూలి మృతి చెందింది. మరో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వండ్రంగి ... లో గుడ్డిగూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది. బంధువుల తెలిపిన వివరాల ప్రకారం గుడ్డిగూడెం గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళలు అదే గ్రామానికి చెందిన రైతుకు చెందిన పొలంలో వరినాట్లు వేసేందుకు ఉదయం 6 గంటలకు వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో రైతు తమ్ముడికి చెందిన ట్రాక్టర్లో తిరుగుపయనమయ్యారు. కొవ్వాడ కాలువ గట్టు వద్దకు వచ్చేసరికి ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలో బోల్తా పడింది. వెంటనే స్థానికులు జెసిబి సాయంతో ట్రాక్టర్ కింద ఉన్న మహిళలను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో సుగ్గసనభోయిన వెంకటపద్మావతి(42) అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరు కూలీలు కత్తవ నాగలక్ష్మి, సుగ్గసనభోయిన మంగతాయారు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఐదుగురు కూలీలు స్వల్పగాయాలతో బయట పడ్డారు. గాయపడిన వారిని గోపాలపురం సిహెచ్‌సికి తరలించారు. దేవరపల్లి సిఐ నాగేశ్వరనాయక్, తహశీల్దార్ సాయి ప్రసాద్ ఆస్పత్రికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. మృతురాలు వెంకటపద్మావతికి భర్త, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తలు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశారు. మరో కుమార్తెకు వివాహం చేయాల్సి ఉంది. పద్మావతి మృతితో ఆ ఇంట విషాదం నెలకొంది.



చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ

సక్రమంగా కట్టే వారికే రుణాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

సక్రమంగా రుణాలు కట్టే సంఘాలకు మాత్రమే బ్యాంకులు రుణాలు ఇచ్చే పరిస్థితి ఉంటుందని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. నియోజకవర్గంలోని 77 డ్వాక్రా సంఘాలకు మంజూరైన రూ.12.46 కోట్ల రుణాల చెక్కును శుక్రవారం ఆ గ్రూపు సభ్యులకు స్థానిక మహిళ సమాఖ్య భవనంలో అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ నూటికి 80 శాతం రుణాలను ఎవరైతే కడతారో వాటిని ప్రామాణికంగా చేసుకుని బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. అనాడు పొదుపు సంఘాలుగా మొదలైన మీరు ఈరోజు ఆర్థిక పరిపుష్టి చెందే విధంగా తయారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్తులూరి నాగబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, జగ్గంపేట, రాజపూడి సొసైటీ చైర్మన్లు బుర్రి సత్యనారాయణ, కంటే బుల్లబ్బు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, టిడిపి నాయకులు జీను మణిబాబు, పాండ్రంకి రాంబాబు, ఎంపిడిఒ ఎవిస్.చంద్రశేఖర్, వెలుగు ఎపిఎం ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి పట్టణ, మండల కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం పట్టణ, మండల టిడిపి కమిటీల ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఎన్నికలు పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ అధ్యక్షతన పిఠాపురం టౌన్, మండలం, గొల్లప్రోలు పట్టణ అధ్యక్షుల ఎన్నికలు నిర్వహించారు. పిఠాపురం పట్టణ అధ్యక్షులుగా బొజ్జ సతీష్, ప్రధాన కార్యదర్శిగా కోరుప్రోలు శ్రీనువాస్, మండల అధ్యక్షులుగా సఖుమళ్ళ గంగాధరరావు, ప్రధాన కార్యదర్శి నెక్కల సత్యనారాయణ, గొల్లప్రోలు పట్టణ అధ్యక్షులుగా గుండ్ర సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా బస్వా సత్యనారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ గ్రామాలు, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు సీనియర్ నాయకులు అభిప్రాయ, సంతకాల సేకరణ ప్రకారం అందరి సమక్షంలో కమిటీలను ఎన్నుకున్నారు.

శ్మశాన వాటికకు దారేది?

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం గోదావరి రేవులో ఉన్న దళితుల శ్మశాన వాటికకు దారి లేకుండా పోయింది. గ్రామంలో ఇంటికి వెళ్లి సేకరిస్తున్న చెత్తాచెదారాలను గోదావరి రేవులో డంపింగ్ చేయడంతో శ్మశాన వాటికకు దారి లేకుండా పోయింది .దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త తడిసి దుర్వాసన వెదజల్లుతుంది. చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారుచేసి తద్వారా సంపద సృష్టించాలన్న ఉన్నతాధికారుల ఆశయాలను పంచాయతీ అధికారుల ఆశలు అడియాశలయ్యాయి. దీంతో గ్రామంలో ఎక్కడ చెత్త వేయడానికి స్థలం లేకపోవడంతో గోదావరి పుష్కరాల రేవు చెంతనే గుట్టలుగా చెత్త డంపింగ్ చేస్తున్నారు. ఈ తరుణంలో గోదావరి రేవులో ఉన్న శ్మశాన వాటిక కు మార్గము లేదు . దళితులు ఎవరైనా మరణిస్తే వారిని శ్మశాన వాటికకు తీసుకెళ్లడానికి దారి లేక నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై పంచాయతీ అధికారులకు విన్నవించిన వారు పట్టించుకోవడం లేదంటూ దళితులు ఆవేదన చెందుతున్నారు. గోదావరికి వరద నీరు చేరినప్పుడు అందులో కలిసిపోయి గోదావరి నీరు కలుషితం అవుతుంది. ఉన్నతాధికారులు కలగజేసుకుని చెత్తను తొలగించాలన్నారు.

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

ప్రముఖ సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం



తాళ్లరేవులో కేక్ కట్ చేస్తున్న సేవ సమితి సభ్యులు

కరపలో జనసేన నేత డాక్టర్ బొండ సూర్యారావు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. 50 మంది పంచాయతీ కార్మికులకు నిత్యావసర వస్తువులు అందించారు. పోలిశెట్టి తాతీలు, సైనవరపు భీమశంకర్, పుణ్యమంతుల గంగ సత్యనారాయణ, ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు, దూడల నారాయుడు, కరప సర్పంచ్ సాదే ఆశ జ్యోతి లోహిదాస్, దేవు వెంకన్న ,వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

జగ్గంపేట జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పాఠశాలలోని పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్ పంపిణీ చేశారు. రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గణ శేఖర్, దొడ్డ శ్రీను, బుద్ది ప్రసాద్, జత్తుక నాగేశ్వరరావు, మరిసే రామకృష్ణ, మాదారపు వీరబాబు, గోకేడ ప్రసాద్, పాఠంశెట్టి రమేష్ పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు పండ్లు పంపిణీ చేశారు. మామిడి శ్రీను, ముచ్చర్ల విజయ రమేష్, లోగీసు శేఖర్, సిరిపురపు రాజేష్, అనంతారపు రాజు, మసిరపు నాగేశ్వరరావు ఉన్నారు.

తాళ్లరేవు సొసైటీ అధ్యక్షులు వీళ్ల వీర, జనసేన పార్టీ మండల అధ్యక్షులు అత్తిలి బాబూరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు కేక్ కట్ చేశారు. చిరంజీవి సేవాసమితి ప్రతినిధులు పేదలకు భోజనాలు అందజేశారు. చిక్కం శ్రీను, గ్రంధి బుజ్జి, రాజు, టి.రాంబాబు, మత్యుర్తి మణికంఠ, ఎలిపే నాగేశ్వరరావు, సూరంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

సిఎం పర్యటనకు భారీ బందోబస్తు

ప్రజాశక్తి - సామర్లకోట

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను దృష్టిలో ఉంచుకుని సామర్లకోట, పెద్దాపురం పట్టణాలతో పాటు ప్రధాన జంక్షన్లలో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్‌పి బిందు మాధవ్ తెలిపారు. మొత్తం 1,045 మంది సిబ్బందిని బందోబస్తుకు నియమించినట్లు ఆయన వివరించారు. శుక్రవారం సామర్లకోట పూర్ణ కళ్యాణ మండపంలో ముఖ్యమంత్రి భద్రతా ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో ఎస్‌పి మాట్లాడారు. ఈ బందోబస్తులో ఐదుగురు ఎఎస్‌పిలు, 14 మంది డిఎస్‌పిలు, 51 మంది సిఐలు, 91 మంది ఎస్ఐలు, 183 మంది ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 467 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 69 మంది మహిళా కానిస్టేబుళ్లు, 165 మంది హోమ్‌గార్డులు ఉన్నట్లు చెప్పారు. పోలీస్ అధికారులు సిబ్బందికి పూర్ణ కళ్యాణ మండపంలో భద్రతా బాధ్యతలపై మార్గదర్శకాలు ఇచ్చినట్లు ఎస్‌పి తెలిపారు. సిఎం పర్యటనా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి, జెసి రాహుల్ మీనా, ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, డిఎస్‌పి డి.శ్రీహరి రాజు పర్యవేక్షించారు.

వైసిపి బలోపేతానికి పని చేయాలి

ప్రజాశక్తి-కిర్లంపూడి

వైసిపి బలోపేతానికి కలసికట్టుగా పని చేయాలని పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మాజీ మంత్రి వైసిపి పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభం నివాసంలో మండల కన్వీనర్‌లు, నియోజకవర్గ అనుబంధ కమిటీ విభాగాల సభ్యులతో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్న వారికి వివిధ పదవులతో వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో గుర్తింపు ఇచ్చామన్నారు. అన్ని గ్రామాల్లో సామాజిక వర్గాల ప్రకారం ఉత్సాహంగా పనిచేసే కార్యకర్తలను గ్రామాల్లో, బూత్ కమిటీల్లో గుర్తించాలని సూచించారు. ఈ జాబితాను త్వరలోనే పూర్తి చేయాలన్నారు. పదవులు కేటాయించిన వారంతా గ్రామస్థాయిలో కార్యకర్తలతో మమేకమై పని చేయాలని సూచించారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలో పాల్గొనేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గొల్లు దివాణం, శిడగం వెంకటేశ్వరరావు, నరాల శ్రీను, రామిశెట్టి నాని, గుడాల వెంకటరత్నం, సరమర్ల మధుబాబు, గొల్లు వెంకటరమణ, సకురు గుర్రాజు, నడిగట్ల త్రిమూర్తులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యార్థి దశ నుంచీ ఉన్నత విలువలు అలవాటు చేసుకోవడం ద్వారా ఉత్తమ పౌరులుగా ఎదగాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్రహ్మకుమారిలు అపర్ణ, రత్నకుమారి చెడు వ్యసనాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టిఎస్.పద్మావతి, ఎన్.హరినాథ్, పీడీ పి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సిఎం చంద్రబాబు, ఎంఎల్‌ఎ నెహ్రూ చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి-గండేపల్లి

తాళ్లూరులోని లిఫ్ట్ మరమ్మతులకు ప్రభుత్వం రూ.52 కోట్లు విడుదల చేసిన నేపథ్యంలో పుష్కర ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు ఆధ్వర్యంలో రైతులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఎ నెహ్రూను రైతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా పుష్కర అంతర్భాగమైన తాళ్లూరు లిఫ్ట్ సిమెంట్ పైపులు పూర్తిగా పాడై 31 వేల ఎకరాలకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం దీన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో గత ఎన్నికల్లో చంద్రబాబు జగ్గంపేట ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు లిఫ్ట్ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు హామీ ఇచ్చారని తెలిపారు.డిఇ శ్రీనివాసరావు, ఎస్‌విఎస్.అప్పలరాజు, పోతుల మోహనరావు, అడపా భరత్, కొత్త కొండబాబు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు, సుంకవల్లి రమేష్, శీలామంతుల వీరబాబు, సుంకవిల్లి రాజు, బొల్లంరెడ్డి రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య, కురుకూరి వీర వెంకట చౌదరి, యర్రంశెట్టి బాబ్జి, అవసరాల బాలసుబ్రమణ్యం, రామకుర్తి నరసింహ పాల్గొన్నారు.

టిడిపి రూరల్ ఇన్‌ఛార్జిని నియమించాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

టిడిపి కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తల విభేదాలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో 49 గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు కలిసి రాజ్యసభ సభ్యులు ఎంపీ సానా సతీష్ కార్యాలయం ఇన్‌ఛార్జి మేకా లక్ష్మణ్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్.వర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పార్టీ అధిష్టానం పిల్లి సత్యనారాయణ మూర్తిని కో ఆర్డినేటర్‌గా, కటకంశెట్టి ప్రభాకర్‌ని కో కోఆర్డినేటర్‌గా నియమించిందన్నారు. బాబీ ఎంఎల్‌ఎ అభ్యర్థిత్వం కోసం కృషి చేస్తూ తన ప్రలోభాలకు ఆకర్షితులైన సుమారు పది మంది కార్యకర్తలతో పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ మూర్తి దంపతులపై లేనిపోని ఆరోపణలు చేయించడం, ఫిర్యాదులతో విభేదాలకు కారణమవుతోందన్నారు. బాబీ, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు కేడర్‌లో గందరగోళం సృష్టిస్తున్నారని తెలిపారు. కటకంశెట్టి ప్రభాకర్, పరిశీలకుడు కుడుపూడి సత్తిబాబును తప్పించాలని డిమాండ్ చేవారు. ఈ కార్యక్రమంలో గండి వెంకటేశ్వరరావు, కొండా వినాయక్, జక్కి అప్పన్న, గుబ్బల సత్య శివలింగం, మాత లక్షణ్, కోడి సీతారామయ్య, రామసత్యనారాయణ, పంపన కన్నారావు, గొల్లపల్లి త్రిమూర్తులు, కేసుబోయిన ఏడుకొండలు, పెండెం శ్యామ్ పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యవస్థాపకులుగా మారాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం



సమావేశంలో పాల్గొన్న కళాశాల సిబ్బంది

విద్యార్థులు వ్యవస్థాపకులుగా మారాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక లారీ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం ఆమె అధ్యక్షతన జరిగిన ప్రధానమంత్రి ఉచిత శిక్ష అభియాన్ పథకం నేషనల్ వర్క్ షాప్‌ను హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర, జాతీయ స్థాయి నుంచి వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు రిసోర్స్ పర్సన్స్‌గా హాజరయ్యారు. ఎపిసిసిఇ జెడి డాక్టర్ సిహెచ్.కృష్ణ ఆన్‌లైన్‌లో ఈ సమావేశంలో హాజరై విద్యార్థులకు నూతన ప్రాజెక్టుల ఏర్పాటుపై వివరించారు. జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి చెన్నారావు, వర్క్ షాప్ కన్వీనర్‌లు డాక్టర్ ప్రయాగ మూర్తి ప్రగడ, కె.సురేష్, వెంకటేశ్వరరావు, రామారావు, డాక్టర్ మదీనా సాహెబ్, డాక్టర్ వివి.శివప్రసాద్, కె.శ్రీలక్ష్మి, బి.వీరభద్రరావు, డాక్టర్ కెవి.బంగార్రాజు, మేరీ రోసిలిన పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ

హాస్టల్స్‌లో మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

బిసి సంక్షేమ హాస్టల్లో మెరుగైన సౌకార్యలు, మెరుగైన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ అదేశించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని హెచ్‌డబ్ల్యూఒల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌డబ్ల్యూఒల పనితీరును మెరుగు పర్చేందుకు, వారి పనితీరు తెలుసుకునేందుకు నూతన విధానాన్ని తీసుకొచ్చామన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల విధి నిర్వహణలను విభ జించి ప్రతి దానికి కొన్ని మార్కులు కేటాయించామన్నారు. సెప్టెంబర్ 5 నాటికి రాష్ట్రంలోని వసతిగృహాల్లో 244 మంది నాల్గవ తరగతి సిబ్బందిని నియమిస్తామన్నారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ శాఖ, సంచాలకులు ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాల్లో ఉన్న డిఎస్‌డబ్ల్యూఒలు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా ముఖ్యపాత్ర పోషించాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లను సంప్రదించి ఆయా వసతిగృహాల్లో ఉన్న సమస్యలు తెలియపరిచి వాటి పరిష్కారానికి నిధులు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలలకు ఒకసారి జిల్లాల్లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్‌బిసి వెల్ఫేర్, డిసిఎస్.రాజు, ఎంజెపి రెసిడెన్షియల్ స్కూల్ సెక్రటరీ, పి.మాధవీలత, డిఎస్‌డబ్ల్యూఒలు, బి.శశాంక, సత్యరమేష్, వెంకటేశ్వరరావు, ఎబిసిడబ్ల్యూఒలు పాల్గొన్నారు.

టాప్ టెన్‌లో 'అరిగెల' కేస్ స్టడీ స్టోరీ

ప్రజాశక్తి - పెరవలి



జాతీయ స్థాయి కేస్ స్టడీ పోటీలు టాప్ 10లో అరిగెల ఆరుణకుమారికి సంబంధించిన ప్రాజెక్టుకు చోటు దక్కింది. ముక్కామల గ్రామానికి చెందిన అరిగెల అరుణకుమారి సర్పంచిగా రాజకీయ ప్రస్తావం ప్రారంభించి నేడు కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ స్థాయికి ఎదిగారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా, ఆయన ప్రవేశపెట్టిన 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా మహిళలకు పంచాయతీరాజ్ వ్యవస్థలో 33 శాతం రిజర్వేషన్ కల్పించిన కషిని స్మరించుకుంటూ రాజీవ్ గాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కేస్ స్టడీ పోటీ నిర్వహించారు. దేశవ్యాప్తంగా 100కిపైగా ప్రముఖ విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. రాజానగరం నియోజకవర్గం కూనవరానికి చెందిన దూలం అరుణ్‌తేజ అరిగెల అరుణకుమారిపై కేస్ స్టడీ చేశారు. 'ఫ్రం కిచెన్ టు కాన్స్టిట్యూషన్' పేరుతో ఆమె కథనాన్ని సమర్పించారు. జాతీయ స్థాయిలో ఈ కేస్‌స్టడీ కథనానికి టాప్‌టెన్‌లో చోటు దక్కింది.

'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర'ను జయప్రదం చేయాలి

అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో ఆగస్ట్ 23న జరగనున్న స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంపై అన్ని విభాగాధిపతులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, జివిఎస్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జ్ అధికారులతో కలెక్టర్ శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్ట్ నెలకు సంబంధించి 'పరిశుభ్రత-వ్యాధుల నివారణ' థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో నీటి నిల్వలను తొలగించడం, దోమల నివారణ, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యాలయాల్లో నిరుపయోగం ఉన్న ఫర్నిచర్ తొలగింపు, ప్రాంగణాల్లో శుభ్రత వంటివి చేయాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రపరచడం, ఫైళ్లు, ర్యాక్‌లు, ఐటీ పరికరాలను శుభ్రపరచి క్రమబద్ధీకరించడం, అలాగే సాసా యాప్‌లో ఈవెంట్ రోజున ఫోటోలు, నివేదికలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే స్వమిత్వ సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటివరకు 190 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ జారీ అయ్యిందన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద 15 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం 16 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ పనులు పకడ్బందీగా జరుగాలంటే మండల స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ బృందంలో తహశీల్దార్, మండల సర్వేయర్, నైపుణ్యంతో కూడిన సచివాలయ సర్వే కార్యదర్శి ఉండాలని సూచించారు. ఇఒపిఆర్‌డి నోడల్ అధికారిగా కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి రోజూ కనీసం ఒక ఎల్‌పిఎం(లీగల్ ప్లాట్ మేజర్‌మెంట్) క్లియర్ చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని, గ్రౌండ్ ట్రూథింగ్ పనులు సమాంతరంగా కొనసాగించాలని ఆదేశించారు. రీస్వేపై ఎంపిడిఒలు, తహశీల్దార్లు దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమన్వయంతో సమయానికి పనులు పూర్తిచేయాలన్నారు. గ్రామాల వారీగా ప్రణాళిక సిద్ధం చేసి, నిర్దేశించిన అంచనాల ప్రకారం రీ సర్వే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



లీకవుతున్న పైపులైన్

పైపులైన్‌కు లీకులు

ప్రజాశక్తి - జగ్గంపేట

మామిడాడలో ఫిల్టర్ వాటర్ పైపులైన్‌కు లీకులు పడి తాగునీరు వధాగా పోతోంది. ఏలేరు జలాలను లిఫ్ట్ చేసి శుద్ధి చేసి అన్ని గ్రామాలకు పైపులైన్ల ద్వారా అందిస్తున్నారు. ఆ నీటి పైపులైన్ మామిడాడ బిసి కాలనీ వద్ద లీకై సిమెంట్ రోడ్డు పైనుంచి ప్రవహిస్తోంది. గత కొన్ని రోజులుగా పైపులైన్ లీక్ అయ్యి నీరు పోవడంతో పాటు, ఆ పైపులైన్‌లోకి మురుగునీరు పోయి తాగునీరు కలుషితం అవుతోంది. పైపులైన్ లీకుతో నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీ వాసులు చెబుతున్నారు. పంచాయితీ సిబ్బందికి అనేకమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆ కాలనీ వాసులు పేర్కొంటున్నారు.

ఏడాదిపాటు శత వసంతాల వేడుకలు

జాంపేట కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జాంపేట కో ఆపరేటివ్ బ్యాంకు శత వసంతాల వేడుకలను ఏడాది పాటు నిర్వహిస్తామని బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్ తెలిపారు. శుక్రవారం బ్యాంకులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది ఆగస్టు 22న బ్యాంకు శత వార్షికోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈలోగా నెలకు ఒక బ్రాంచిలో శత వసంతాల వేడుకలు నిర్వహిస్తామని వివరించారు. ఈ సందర్భంగా ఒక సావనీరు ద్వారా తమ బ్యాంకు నూరేళ్ళ ప్రగతిని, సాధించిన విజయాలను ప్రజలకు తెలియచేస్తామని ఆయన చెప్పారు. శత వసంతాల ప్రారంభం సందర్భంగా డిపాజిట్ దారులకు ప్రతి రూ.లక్ష డిపాజిట్‌కు రూ.10 వేలు చొప్పున షేరు ధనం మంజూరు చేయాలని తమ పాలకవర్గం తీర్మానం చేసినట్లు బొమ్మన జయకుమార్ తెలిపారు. ఈ విధంగా మంజూరు చేసే షేరు ధనంపై ఒక్కొక్కరికి రూ.1,50,000 మించ కూడదని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం ఉన్న 13 బ్రాంచీలు ద్వారా రూ.793 కోట్ల వ్యాపారం జరుగుతోందన్నారు. ప్రతి సంవత్సరం బ్యాంకు లాభాలను ఆర్జిస్తూ సభ్యులకు క్రమం తప్పకుండా డివిడెండ్ చెల్లిస్తున్నామని తెలిపారు. శత వసంతాల సంవత్సరం నాటికి రూ.900 కోట్ల వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొబైల్ బ్యాంకింగ్ ప్రారంభించామని, అన్ని బ్రాంచీల్లో ఎటిఎం సేవలు కల్పించి వాటి ద్వారా రెండు నుంచి మూడు లక్షల ఆదాయం ఆర్జిస్తున్నామన్నారు. ఎన్‌పిఎని నియంత్రించి జీరో శాతం నెట్ ఎన్‌పిఎ సాధించామన్నారు. డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు అందించి, గోల్డ్ లోన్లు, హౌసింగ్ రుణాలు, తనఖా రుణాలు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వడ్డీ రేట్లు సవరించి వ్యాపారాభివృద్ధి సాధించామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్, డైరెక్టర్లు ప్రసాదుల హరినాథ్, డి.పార్వతిసుందరి, జామిశెట్టి గాంధీ, మహంతి లక్ష్మణరావు, జామి కృష్ణ, గుంటముక్కల సత్యనారాయణ ప్రసాదరావు, యాండ్రపు రామకృష్ణ, కనకం నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి సెక్రటరీ, సిఇఒ మద్దాల విజయప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురం విలీనం కోసం ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గన్ని కాకినాడ జిల్లాలో కలపాలని అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. కె.గంగవరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో. ప్రజల న్యాయమైన డిమాండ్ అయిన 'రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని నినాదాలు చేశారు. రామచంద్రపురం నియోజక వర్గ అఖిలపక్ష జెఎసి తరపున కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో-కన్వీనర్ బి.సిద్ధూ, సిపిఐ నాయకులు పి.రాము, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బుంగ రాజు, రామచంద్ర పురం నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోట శ్రీను, విక్టర్ నంద తదితరులు మాట్లాడుతూ అమలాపురం జిల్లా కేంద్రం రామచం ద్రపురం నుంచి దాదాపు 60 కిమీ. దూరంలో ఉండడం వల్ల ప్రజలు పరిపాలన, వైద్యం, విద్య, రవాణా, ఉద్యోగావకాశాల విషయంలో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాకినాడ జిల్లా కేంద్రం రామచంద్రపురానికి కేవలం 25 కి.మీ. దూరంలో ఉందని, అక్కడే ఆధునిక వైద్య సదుపాయాలు, విశ్వవిద్యాలయం, కళాశాలలు, ఉపాధి అవకాశాలు, పరిపాలన అందుబాటులో ఉన్నాయని వివరించారు. జెఎసి ప్రతినిధులు కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి, ఎంపిపిలకు, గ్రామ సర్పంచ్‌లకు వినతిపత్రాలు సమర్పించి, మండల పరిషత్ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరారు. పంపన నాగమణి, సుబ్బారావు బాలాంత్రం సర్పంచ్ చాగంటి సాంబశివరావు, తామరపల్లి సర్పంచ్ తోకల శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వెంటపల్లి భీమా శంకరం, అంబటి కృష్ణ, సిపిఐ నాయకులు శారద, నల్లా వెంకటేష్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపిడిఒ ఎ.రాజు, పంచాయతీ రాజ్ ఎఇ డి.వీరభద్రరావు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జరుగుతున్న, జరిగిన, జరగబోయే పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద తాకిడి నీ నియంత్రించేలా మనం చేసే అభివృద్ధి పటిష్టంగా జరగాలన్నారు. రాబోయే పుష్కరాల నేపథ్యంలో లంక గ్రామాలను క్షుణ్ణంగా పరిశీలించి పుష్కర ఘాట్లు, దోబీ ఘాట్లు వంటివి పటిష్టంగా నిర్మించేందుకు ప్రణాళికలతో కూడిన అంచనాలను రూపొందించాలన్నారు. ముఖ్యంగా డ్రయినేజీ వ్యవస్థ, రోడ్లు, శానిటేషన్ విభాగాలు ఎలా పనిచేస్తున్నాయనే దానిపై దృష్టి సారించాలని వారు ఆదేశించారు.